క్లుప్తంగా

తిరుమల క్షేత్రపాలకుడికి అభిషేకం


రుద్రునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల : తిరుమల గోగర్భం సమీపంలోని రుద్ర రూపమైన క్షేత్రపాలకుడికి శనివారం వేడుకగా అభిషేకం నిర్వహించారు. మహాశివ రాత్రి సందర్భంగా ఏటా రుద్రునికి అభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరి నీళ్ల తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన

చంద్రగిరి : మామండూరులో గొడవకు కారణమైన వివాదాస్పద స్థలాన్ని తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప శనివారం పరిశీలించారు. దళితులు దారిగా వినియోగించుకుంటున్న స్థలంలో కొందరు అక్రమంగా గోడ కట్టి, ప్రశ్నించిన వారిపై దాడి చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా దారి సమస్య పరిష్కరించేందుకు ఇప్పటికే రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో డీఎస్పీ గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. దళితుల సమస్య పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన డీఎస్పీకి అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత హితేంద్రనాథ్ రెడ్డి

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శనివారం పిచ్చినాయుడుపల్లెకు చెందిన బ్లూమింగ్ బడ్స్ పాఠశాల అధినేత హితేంద్రనాథ్‌రెడ్డి రూ.50వేల విరాళం అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డికి నగదు అందజేశారు. దాతకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజన హక్కుల రక్షణే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : దళిత, గిరిజనుల హక్కుల రక్షణే లక్ష్యంగా పోరాడుతున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. శనివారం గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజనుల అభివృద్ధికి కేటాయించిన నిధులను వారికే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య, నాయకులు ఆర్.బలరాం, జగన్నాథం, ఎం.తిరుమల, వరగంటి ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా శశి విద్యాసంస్థల వార్షికోత్సవం


వార్షిక వేడుకల్లో అతిథులు, విద్యాసంస్థల నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తనపల్లిలోని శశి విద్యాసంస్థల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్సార్ కృష్ణమూర్తి హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చన్నారు. పిల్లలకు విలువలు ఏర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉంటుందని వెల్లడించారు. విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మాట్లాడుతూ విద్యను పిల్లల ఇష్టపడేలా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీప్రియ, డైరెక్టర్లు బూరుగుపల్లి కిరణ్‌కుమార్, బూరుగుపల్లి స్వాతి, అకడమిక్ డైరెక్టర్ ఎంవీ రావు, డీన్ హరినాథ్‌రెడ్డి, సీఈఓ ఎస్‌వీజీ ప్రసాద్, ప్రిన్సిపాళ్లు జి.బేబి మల్లిక, కె. ఉషా మహేశ్వరి పాల్గొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రభుం ప్రాణనాథం..
విభుం విశ్వనాథం

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదిమాధ్యాంతరహితుని సేవలో భక్తజనులు పులకించారు. గంగా ప్రియనాథుని పుణ్యజలాలతో అభిషేకించి పునీతులయ్యారు. లయకారుని లీలామానుష స్వరూపాన్ని వీక్షించి తరించారు. పరమేశ్వరి ప్రాణవల్లభునికి విశేష పూజలు నిర్వహించి తన్మయత్వం చెందారు. నంది వాహనుని దివ్యమంగళ తేజాన్ని దర్శించి ఆధ్యాత్మికానందంలో విహరించారు. ముక్కంటి మహిమాన్విత కటాక్షంతో పరవశించారు.

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- స్వామి, అమ్మవారికి విశేష అభిషేకాలు
- వేకువ నుంచే పోటెత్తిన భక్తులు
- ఆదిదంపతులకు విశిష్ట వాహన సేవలు


కపిలతీర్థంలో నంది వాహనంపై ఊరేగుతున్న ఆదిదంపతులు


తొండవాడ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఆలయాల్లో శనివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు.

కపిలేశ్వరస్వామి ఆలయంలో..

కపిలేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు.ఉదయం 5.30 నుంచే భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

భోగితేరు ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భోగితేరు ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. భజన బృందాల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి రథోత్సవం కోలాహలంగా సాగింది. అనంతరం స్నపన తిరుమంజనం చేపట్టారు. రాత్రి స్వామి వారి నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవ పూజను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

నగరంలోని మంచినీళ్ల గుంట వద్దనున్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శారదాదేవి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాళ్లపల్లి రామమూర్తి, ప్రధాన అర్చకుడు వై.సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్పనాంబిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో..

దేవేంద్ర థియేటర్ సమీపంలోని శ్రీకల్పనాంబిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

జీవకోనలోని మద్విరాట్ పోతూలూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు తులసీ విశ్వనాథ్‌రెడ్డి, విశ్వచందన్‌రెడ్డి, రాజారెడ్డి, అర్చకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కపిలేశ్వరస్వామి ఆలయం వద్ద శాంతి స్ఫూర్తి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఓఎస్‌డీ రామకృష్ణ పాల్గొన్నారు.

అప్పలాయిగుంట శివాలయంలో..

అప్పలాయిగుంట శివాలయం వద్ద తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పోగుల వెంకటరమణ, గిరిధర్, అర్చకుడు చెంగయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో..

నగరంలోని అన్నారావు సర్కిల్ వద్ద శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే గోవిందమాంబ సమేత బ్రహ్మంగారి మూలమూర్తులకు, సదాశివేశ్వర స్వామికి విశేష అభిషేక పూజలు జరిపించారు. పూజారి లక్ష్మీపతి తీర్థప్రసాదాలు అందజేశారు.

కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో..

కాపు సంక్షేమసేన ఆధ్వర్యంలో అనంత వీధి కూడలి వద్ద భక్తులకు అన్నప్రదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నేత చెరుకుల నీలాద్రి, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, నాయకులు మధుబాబు, ప్రకాష్, రమణ, ఆముదాల తులసీరామ్ పాల్గొన్నారు.

జీవలింగేశ్వరస్వామి ఆలయంలో..

తిరుపతి మంగళం : జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళంలోని జంబుకేశ్వరస్వామి, తిరుమలనగర్‌లోని ఈశాన్యేశ్వరస్వామి ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే భూమన ప్రత్యేక పూజలు...

జీవకోనలోని జీవలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సురేంద్ర కుమార్‌రెడ్డి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి రాజేంద్ర ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

తొండవాడలో..

చంద్రగిరి : తొండవాడలోని అగస్త్యేశ్వర స్వామి వారి (ముక్కోటి) ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 1.30 గంటలకు అగస్త్య మహామునికి అభిషేక సేవ జరిపించారు. అనంతరం 2.30 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్లు నంది వాహనంపై ఊరేగారు. డీఎస్పీ నరసప్ప, సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి కొత్తపేటలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి (పుట్టాలమ్మ) ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శివకుమార్ శర్మ రుద్ర హోమం చేపట్టారు. తిరుచానూరులోని పరాశరేశ్వర స్వామివారి ఆలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

ఓంకార జ్యోతి లింగేశ్వర స్వామి ఆలయంలో..

తిరుపతి గాంధీ రోడ్డు : వెదళ్లచెరువు గ్రామం లోని ఓంకార జ్యోతి లింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 30 అడుగుల మహా శివలింగానికి పాలాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర్ స్వామి, సూరా రఘునాథరెడ్డి, ఆంజనేయులు, జంగారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: నియోజకవర్గంలోని పలు శైవాలయాల్లో స్వామి వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి చెవిరెడ్డి ముందుగా తలకోనలోని సిద్ధేశ్వరస్వామికి పట్టువస్త్రాలను అందజేశారు. శేషాపురంలోని శేషచల లింగేశ్వర స్వామి, చంద్రగిరి శ్యామలంబ సమేత మల్లీశ్వర స్వామి, నాగాలమ్మ, తొండవాడ అగస్తీశ్వరస్వామి, తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లి, చిగురువాడ, దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి, అవిలాల, సాయినగర్, యోగిమల్లవరం, రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి, రాయలచెరువు, అనుప్పల్లి, బొప్పరాజుపల్లి గ్రామాల్లోని శైవాలయాలను దర్శించుకుని, పట్టువస్త్రాలను సమర్పించారు.

అనంతరాయల శివాలయంలో..

పాకాల : శంఖంపల్లి సమీపంలోని కొండపై ఉన్న అనంతరాయలు, చెన్నుగారిపల్లె శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబదేవికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.


రథంపై ఊరేగుతున్న కామాక్షి సమేత కపిలేశ్వరస్వామివారు


కపిలతీర్థం ఆలయం ఆవరణలో భక్తుల పూజలు


మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం


చంద్రగిరి : స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు


విశేష పూజ నిర్వహిస్తున్న అర్చకుడు


జీవకోన వద్ద విశ్వం విద్యాసంస్థల ఆధ్వర్యంలో..


కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో..


చంద్రగిరి: ప్రత్యేక అలంకరణలో రుద్రుడు


ఫలపుష్పాలంకరణలో ముక్కంటి


చంద్రగిరి : వెండి కవచాలంకరణలో ఆనందవల్లి దేవి


వెదళ్లచెరువులో అన్నదానం


చంద్రగిరి : ప్రత్యేక అలంకరణలో శివయ్య


నంది సర్కిల్ వద్ద రద్దీ


కపిలతీర్థంలో స్వామివారి దర్శనానికి వెళుతున్న భక్తులు


భాకరాపేట : పుష్పాలంకరణలో భీమేశ్వరస్వామి

బలిజల అభ్యున్నతే లక్ష్యం


బలిజ భవన స్థల పరిశీలనలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : బలిజల అభ్యున్నతే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎల్ఐసీ రోడ్డులో బలిజ భవనం నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బలిజ జేఏసి అధ్యక్షులు నీలం బాలాజి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బలిజ భవనం కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా పరిరక్షిస్తామన్నారు. స్థలం చుట్టూ వెంటనే ప్రహరీ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనం నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కాపు నేస్తం తదితర పథకాలతో బలిజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ నాయకులు బాలిశెట్టి కిషోర్, సురేష్, బండ్ల లక్ష్మీపతి, చందు రాయల్, దినేష్ రాయల్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి : ప్రభుత్వం అందిస్తున సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, అందుబాటులో వాటర్‌ప్లాంట్లు, రచ్చబండలు, బెంచీల ఏర్పాటు, వివాహ కానుక తదితర కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్ బాబు, తహసీల్దార్ శిరీష, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు పాల్గొన్నారు.

నాగాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి : పట్టణంలోని నాగాలమ్మ ఆలయ అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మహాశివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి వెళ్లిన చెవిరెడ్డికి స్థానిక భక్తులు స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో పక్కాగా మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌తో ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ రామకృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ ఒంటి శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.